## కరాటేలో క్రీడాకారులకు బంగారు పతకాలు



కరాటేలో బంగారు పతకాలు సాధించిన యాడికి క్రీడాకారులు

**యాడికి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

కర్నూల్‌లోని పుష్పరాజ్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన 6వ ఇంటర్ సేట్ కరాటే ఛాంపియన్‌షిప్–2024 పోటీల్లో యాడికి క్రీడాకాలు ప్రతిభ కనబరిచి బంగారు పతకాలను సాధించినట్లు గురువు రామచంద్ర ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో యాడికి మండలానికి చెందిన క్రీడాకారులు భార్గవి, భార్గవసాయి విశేష ప్రతిభ కనబరిచి బంగారు పతకాలు సాధించగా వరుణ్, నేహా, జయసాయి వెండి పతకాలు సాధించినట్లు రామచంద్ర తెలిపారు. దీంతో పలువురు వారిని అభినందించారు. ప్రస్తుతం సభ్య సమాజంలో మహిళలపై జరుగుతున్న ఆకృత్యాలను అరికట్టాలంటే విద్యార్థులకు బాల్యం నుండి ఆత్మరక్షణ క్రీడలైన కరాటే, కుంగ్‌ఫు లాంటి వాటిని ప్రోత్సహిస్తూ శిక్షణ అందిచడం ఉత్తమమని రామచంద్ర పేర్కొన్నారు.

## ఇగుడూరులో చోరీ



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న పోలీసులు

**తాడిపత్రిరూరల్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

మండలంలోని ఇగుడూరు గ్రామంలో చోరీ జరిగింది. వివరాలు ఇలా వున్నాయి, గ్రామానికి చెందిన నారాయణస్వామి, సూరిలు హైదరాబాద్‌కు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు వారి ఇళ్లలో చోరీలకు పాల్పడ్డారు. ఇందులో నారాయణస్వామి ఇంటిలోకి చొరబడి 2 లక్షల రూపాయల నగదు, 12 తులాల బంగారాన్ని దోచుకెళ్లారు. సూరి ఇంటిలో 20 వేల రూపాయల నగదు, బంగారాన్ని దోచుకెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## యల్లనూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

**యల్లనూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

మండల కేంద్రమైన యల్లనూరులో మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్పెషల్ ఆఫీసర్ రఘునాథ్, టిడిపి మండల కన్వీనర్ దొడ్లో రామాంజినేయులు, అధికారులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం వంద రోజుల్లో నెరవేర్చిన హామీలు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి విజయశేఖర్‌నాయుడు, పంచాయతీ కార్యదర్శి గీత, తదితరులు పాల్గొన్నారు.

## పేరవాండ్లపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది



పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్న దృశ్యం

**అమడగూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

మండలంలోని పేరవాండ్లపల్లి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి విత్తనాలను విత్తనశుద్ధి చేయడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు. పంటల్లో పురుగులు, తెలుగుళ్ల యాజమాన్యపద్ధతుల గురించి వివరించారు. తక్కువ పెట్టిబడి ఎక్కువ దిగుబడి ఎలా పొందవచ్చన్న దానిపై రైతులకు అవగాహన కల్పించారు. ఏపిసిఎన్‌ఎఫ్, ఆర్‌వైఎస్‌ఎస్‌కు సంబంధించిన రవీంద్రారెడ్డి, దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ పంటల్లో తెగుళ్ల నివారణకు రసాయనిక మందులు కాకుండా కషాయాల ద్వారా ఎలా అరికట్టవచ్చో వివరించారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పి పవన్‌కళ్యాణ్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక బకాయిలు చెల్లించాలి :ఆపస్

సభ్యత్వ నమోదు కార్యక్రమంలో నాయకులు

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రాయదుర్గం, గుమ్మగట్ట మండలంలో మారంపల్లి, సీజీ దొడ్డి, 74 ఉడేగోళం, రాయదుర్గం, మోడల్‌స్కూల్‌లలో సభ్యత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తమ సమస్యలు సంఘం దృష్టికి గతకొంత కాలంగా పాత పెండింగ్ బిల్లులను మంజూరు చేయానలి చాలా చోట్ల వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. కావున ప్రభుత్వం వెంటనే పిఎఫ్, ఏపిజిఎల్‌ఐ, సంబంధిత సెలవులు తదితర నిలిచిపోయిన బకాయిలను వెంటనే చెల్లించాలని సిపిఎస్ ఉద్యోగులకు రావలసిన డిఎ అరియర్స్ బిల్లులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి.రాజేంద్రప్రసాద్, అనంతపురం జిల్లా అధ్యక్షురాలు కళ్యాణి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్రిస్వామి, సంఘం గౌరవాధ్యక్షులు కారుమంచి, జిల్లా కార్యదర్శి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సమాజ సేవతోనే వ్యక్తిత్వ వికాసం

**- వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్.మాణిక్యారావు**

**అనంతపురం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త ప్రతినిధి**



మొక్కలు నాటుతున్న దృశ్యం

జాతీయ సేవా పథకం వ్యవసాయ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాలలో స్వచ్చ తాహీ సేవాకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్.మాణిక్యరావు, వైద్య విద్యార్థులతో కలిసి చీపుర్లు చేతపట్టి పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. కెమికల్స్‌తో అద్దాలను శుభ్ర పరిచారు. పండ్ల మొక్కలను కూడా సహ అధ్యాపకులు విద్యార్థులు కలిసి న ఆటారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ ఎస్.మాణిక్యారావు మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ ద్వారా, సమాజానికి సేవ చేయడం ద్వారా, విద్యార్థులు వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకునే అవకాశం ఉంటుందని, నేను మాత్రమే కాదు మీరు కూడా ఈ సమాజ శ్రేయస్సులో సామాజిక బాధ్యతతో అందరితో కలిసి బాధ్యత విధంగా నడవాల్సిన బాధ్యత వైద్య విద్యార్థులపైన ఉందని తెలిపారు. దేశంలోనే మా ప్రభుత్వ వైద్య కళాశాల ఎన్ఎస్ఎస్‌కు మంచి పేరు ఉందని, దానికి కారణం మా విద్యార్థులేనని, మానవ దృక్పథాన్ని చూపడంలో ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు ధన సహాయంలో, కరోనా లాంటి విపత్కర పరిస్థితుల్లో మా వైద్య విద్యార్థులు చూపించిన మానవతా సేవలు అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య డాక్టర్ షారోన్‌సోనియా, పేథాలజీ ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ శివశంకర్‌నాయక్, సైకియాట్రి ప్రధాన విభాగాధిపతి ఆచార్య డాక్టర్ వైద్యనాథ్, ఇతర డాక్టర్లు డాక్టర్ భవాని, డాక్టర్ శ్రావణి, డాక్టర్ చైతన్య, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ వరదరాజులు, డాక్టర్ శశాంక్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆదిరెడ్డి పరదేశీనాయుడు, 2కె22, 2కె23 బ్యాచ్ వైద్య విద్యార్థిని, విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నెల 17 నుంచి వచ్చే నెల రెండు వరకు స్వచ్ఛతాహి సేవా కార్యక్రమాలను వివిధ రకాలుగా, వివిధ చోట్ల నిర్వహిస్తున్నామని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరదేశీనాయుడు తెలిపారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమంలో సబ్సిడి పరికరాలపై అవగాహన



పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

**గార్లదిన్నె, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

గార్లదిన్నె మండలం కోటంక, మర్తాడు గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ నూతన పథకాల గురించి రైతులకు వివరించారు. ఉద్యానవన శాఖ పథకం, సబ్సిడిలను వివరించారు. ప్రకృతి వ్యవసాయం గురించి రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. మారుయ డ్రిప్, స్ప్రింక్లర్ గురించి ఎపిఎఐపి అధికారి వివరించారు. 2 రోజులు లోపల ఈ–పంట చేసుకున్న రైతులు అందరు ఇకెవైసి చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులు హెచ్ఈఓఓ, రామాంజినేయులు, ఎంఐఎఓ సుశీలమ్మ, మార్కెటింగ్ డిప్యూటీ ఆర్ఎస్‌కె స్టాఫ్ కార్యక్రమానికి హాజరయ్యారు.

## గుడి స్థలాన్ని ఆక్రమించారు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బాధితులు

**అనంతపురం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త బ్యూరో**

రూరల్ మండలం రాజీవ్ కాలనీ సమీపంలో కాసినాయన, బోయకొండ గంగమ్మ, శ్రీమన్నారయణ స్వామి, ఉభయాంజినేయస్వామి, రామాలయం, సాయిబాబ దేవాలయాల స్థలాలను కొంత మంది దౌర్జన్యంగా ఆక్రమించారని కాపాడాలని ధర్మకర్తలు కోరారు. మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ధర్మకర్తలు, నాగేంద్ర ఆచారి, కె.లక్ష్మినారాయణ, హెచ్ ఓబులేసు, చెన్నంపల్లి ఓబులేసు, కె.ఆదినారాయణ, విశ్వనాథ్‌గౌడ్‌లు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాలుగా దేవాలయాలు నిర్మించుకుని సేవలు చేసుకుంటున్నామని తెలిపారు. గతంలో కొంత కాలం అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించామన్నారు. ఇటీవల కొంత మంది దౌర్జన్యంగా ఆక్రమించారని వాపోయారు. భూ కబ్జాదారులను శిక్షించాలని కోరారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్, ఎస్పీలకు ఫిర్యాదు కూడా చేశామన్నారు. అధికారులు దేవాలయ స్థలాన్ని కాపాడాలని కోరారు.

## పవన్ కళ్యాణ్‌కు సంఘీభావంగా కదిరిలో కూటమి నాయకుల ధర్మదీక్ష

**కదిరి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామివారి లడ్డు ప్రసాదం తయారీలో జంతువుల కొవ్వు, ఫిష్ ఆయిల్ వంటి అవశేషాలు, కల్తీ నెయ్యిని వినియోగించి కోట్లాది మంది శ్రీవారి భక్తుల మనోభావాలను హిందూ సాంప్రదాయాలను అగౌరవ పరిచే విధంగా వ్యవహరించిన అప్పటి ముఖ్యమంత్రి జగన్ టిటిడి చైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డి చేసిన అపచారాలపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ చేపట్టిన ప్రయతిత దీక్షకు మద్దతుగా కదిరి పట్టణంలో కూటమి నాయకులు స్థానిక ఖాద్రిలక్ష్మినరసింహస్వామి ఆవరణంలో ఆదివారం దర్మదీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ ఇన్‌చార్జ్ భైరవ ప్రసాద్, బ్లూమూన్ విద్యా సంస్థల చైర్మన్ శివశంకర్‌లు మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు చేసిన అపచారాన్ని ఖండించి ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే సనాతన ధర్మ పరిరక్షణ కోసం ఒక బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. తామంతా మతాలకు, కులాలకు అతీతంగా సంఘీభావాన్ని తెలియజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బిజెపి నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## క్రీడా ల్లో సత్తా చాటిన హరీష్ స్కూల్ విద్యార్థులు

**కదిరి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

కదిరి రూరల్ పరిధిలోని ఎరుకులవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల క్రీడా పోటీలు నిర్వహించారు. కోకో పోటీల్లో నవ్య, జాహ్నవి, నీలకంఠా, నారాయణస్వామి, అప్సానా, మదిహా, షటిల్‌లో సింధు, యోషిత, రూపశ్రీ, చరణ్‌కుమార్, కౌషిక్, జశ్వంత్, వాలీబాల్‌లో అంజశ్వర్, వినయ్, జయచంద్ర, షాట్‌పుట్, డిస్కత్రోలో అంజశ్వర్, వంద మీటర్ల పరుగుపందెంలో జాహ్నవి, నారాయణస్వామి, అంజశ్వర్, సాయిగణేష్, 400 మీటర్ల పరుగు పందెంలో సాయిగణేష్, యోగాలో చరణ్‌నాయక్, యువరాజులు ఎంపికైనట్లు ఎంఎస్.కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఖాదర్‌వలి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు నేడు (బుధవారం) జరిగే క్రీడాపోటీల్లో పాల్గొంటారన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

## బాల్య వివాహాలపై అవగాహన



మాట్లాడుతున్న ఐసిడిఎస్ పిడి బిఎన్.శ్రీదేవి

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

నగరంలో రామ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌పక్కన ఉన్న బిసి బాలికలకళాశాల హాస్టల్‌లో మంగళవారం సాయంత్రం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసిడిఎస్ పిడి బిఎన్.శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రతి విద్యార్థిని బాల్యంలోనే వివాహాలు చేసుకోకుండా, బాగా చదువుకొని ఉన్నత స్థానాలకు చేరుకున్న తర్వాత వివాహాలు చేసుకోవాలన్నారు. బాల్యంలో వివాహాలు చేసుకోవడం వలన తల్లితోపాటు బిడ్డకు కూడా అనేక సమస్యలు ఎదురవుతాయన్నారు. అనంతరం దాతల సహకారంతో మినీ గ్రంథాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ నోడల్ ఆఫీసర్ వనజాక్షి, సిడిపిఓలు భారతి, లలిత, తాడిపత్రి ఏబిసిడబ్ల్యూఓ రంగమ్మ, అనంతపురం ఏబిసి డబ్ల్యూఓ సుభాషిని, వార్డెన్ రాజేశ్వరి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



పొలం పిలుస్తోంది పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే రాజు

**గుడిబండ, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

గుడిబండ మండల పరిధిలోని కెకెపాళ్యం గ్రామంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యేరాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయశృాఖ అధికారులు అందించిన సలహాలు సూచనలను రైతులు పాటించి అధిక దిగుబడులు సాధించాలని రైతులను కోరారు. అనంతరం పొలం పిలుస్తోంది పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ కృష్ణమీనన్, మండల వ్యవసాయ అధికారి వీరనరేష్, ప్రసూన, పట్టు పరిశ్రమ శాఖ అధికారులు ముత్తప్ప, రియాజ్, తెదేపా మండల అధ్యక్షులు మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, దుర్గేష్, టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు రంగాయాదవ్, బోజరాజ్, నజీర్, శ్రీకాంత్, మాస్, మారుతి, వెంకటరమణ, నటరాజు, చిత్రలింగ, జనార్ధన్ పాల్గొన్నారు.

## మనసాక్షిగా ఒప్పుకుందాం.. ఇది మంచి ప్రభుత్వం అని



రచ్చకట్ట వద్ద కార్యక్రమంలో టిడిపి నాయకులు

**గోరంట్ల, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజుల్లోనే పాలన ప్రజారంజకంగా సాగుతోందని మనమందరం మనసాక్షిగా ఇది మంచి ప్రభుత్వం అని ఒప్పుకుందామని టిడిపి సీనియర్ నాయకులు ఆగిశం నాగరాజు అన్నారు. ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంగళవారం గోరంట్ల పట్టణంలోని 1వవార్డు పరిధిలోని ఆంజనేయస్వామికాలనీలో వున్న రచ్చకట్ట వద్ద ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం ముద్రించిన ఇది మంచి ప్రభుత్వం స్టిక్కర్లను కరపత్రాలను నాయకులు ఇంటింటికి తిరుగుతూ పంపిణీ చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ లక్ష్మినాగరాజు, కార్తీక్, జయకృష్ణ, నారాయణ, చంద్ర, కర్ణ, సోము, వెంకటేష్, మునిస్వామి, హరి, గంగాద్రి, నారాయణస్వామి, అల్లాబకాష్, సోము, గాండ్ల దనేష్, బ్రహ్మ, రంగప్ప పాల్గొన్నారు.

## మోపిదేవిది ఆవేదన కాదు అవకాశవాదం

**అనంతపురం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త బ్యూరో**

నిన్న విజయవాడలో జరిగిన గంగపుత్ర 14 ఉపకులాల సమావేశంలో మోపిదేవి వెలిబుచ్చినది ఆవేదన కాదు అవకాశవాదం అని బెస్త కార్పోరేషన్ మాజీ డైరెక్టర్ కెవి.రమణ పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నిజంగానే అతనిలో ఆవేదనే ఉంటే గంగపుత్ర జాతిలో ఏ ఒక్కరినైనా రాజకీయంగా ఎదగనిచ్చారా..? ఎదగనివ్వకపోగా స్వాతంత్ర్యానంతరం 77 సంవత్సరాలు తర్వాత మొట్టమొదటిసారి గత వైసీపీ ప్రభుత్వం రాయలసీమ బెస్తలకు బెస్త కార్పోరేషన్ ఏర్పాటు చేస్తే ఆ జాతి ఎదగకూడదన్న కుట్రతో ఏమాత్రం అనుభవం, అర్హత లేని వారిని రాష్ట్ర చైర్మన్‌గా ఎంపిక చేసి, రాయలసీమ బెస్త జాతి ద్రోహిగా నిలబడ్డాడన్నారు. అందుకే అతనిది ఆవేదన కాదు తను తప్ప ఎవరూ ఎదగకూడదనే అవకాశవాదం అన్నారు. నాలుగేళ్ల చీకటిలో ఉన్నానని చెబుతున్న ఇతను నాలుగేళ్ల పూర్వం ఎక్కడ ఉన్నట్లు..? తన రాజకీయ స్థానంలో కేవలం నాలుగు సంవత్సరములు కష్టాలు ఎదుర్కోలేని సోఫజస్టికేటెడ్ పొలిటీషియన్ ఇతను. దీనిని బట్టి ఇతను ఎప్పుడు వెలుగోలనే, అటే అధికారంలోనే ఉండాలనే మనస్తత్వం దీనిని బట్టి ఇతను ఇంత కాలం రాజకీయాలలో ఉన్నది సేవ చేయడానికో షేవ్ చేయడానికో యావత్తు గంగపుత్ర జాతి అర్థం చేసుకోవాలని సూచించారు.

## నేటి నుంచి స్కూల్ గేమ్స్ సెలక్షన్లు

**అనంతపురం న్యూటౌన్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

ఈనెల 25వ తేదీ 28వ తేదీ వరకు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్లను ఉమ్మడి జిల్లా విద్యాశాఖ అధికారి బి.వరలక్ష్మి విడుదల చేసినట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా సెక్రెటరీ సుగుణ, శ్రీ సత్యసాయి జిల్లా ఎస్జీఎఫ్ సెక్రెటరీ మెరార్జీ యాదవ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బాల, బాలికలకు స్కూల్ గేమ్స్ సెలక్షన్లు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా ఈనెల 25న జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్‌లో ఫుట్‌బాల్ అండర్–17 సెలక్షన్లు, అదే రోజు కల్లూరు జెడ్పీ హెచ్ఎస్‌లో రెజ్లింగ్ అండర్–14, అండర్–17 సెలక్షన్లు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే ఈ నెల26న అనంతపురంలో శ్రీనగర్ కాలనీలోని నారాయణ టెన్నిస్ అకాడమీలో టెన్నిస్, సాఫ్ట్ టెన్నిస్ అండర్–14, అండర్–17 నిర్వహిస్తున్నామన్నారు. ఈనెల 28న బళ్ళారి రోడ్డులో ని వెరైడియన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో స్విమ్మింగ్ పూల్‌లో మోడ్రన్ పెంటతలాన్ సెలక్షన్స్, అదే రోజు అనంతపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెపక్ తక్రా అండర్ –14, అండర్–17 సెలక్షన్లు నిర్వహిస్తున్నామని, మిగిలిన జిల్లా స్థాయి సెలక్షన్లకు త్వరలో తేదీలను ప్రకటిస్తామన్నారు.

## వంద రోజుల పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారు

**- ఎమ్మెల్యే ఎంఎస్.రాజు**



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్.రాజు



సభకు హాజరైన మహిళలు, ప్రజలు

**గుడిబండ, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

గుడిబండ మండల పరిధిలోని ముత్తుకూరు గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్.రాజు, తెలుగుదేశం పార్టీ రాష్ట్రకార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజు మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వందరోజుల పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో ఉఆన్నరని, ఇచ్చిన మాట ప్రకారం మెగా డిఎస్సీపై తొలి సంతకం చేసి పింఛన్లు నాలుగు వేలకు పెంచారని, విజయవాడలో వరదలు వచ్చినప్పుడు దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా పది రోజులు ఇంటికి వెళ్లకుండా ప్రజల కష్టాలను తీర్చడానికి కృషిచేసిన వ్యక్తి చంద్రబాబునాయుడు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మద్దనకుంటప్ప, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు మంజునాథ్, పరిపాలన అధికారి నారాయణప్ప, వ్యవసాయ అధికారి వీరనరేష్, డిప్యూటీ తహశీల్దారు రాంభూపాల్‌రెడ్డి, ఈఓఆర్డి నాగరాజునాయక్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ కమలమ్మ, పాండురంగప్ప, గురుమూర్తి, డాక్టర్ సెల్ అధ్యక్షులు కృష్ణమూర్తి, మాజీ సర్పంచు శ్రీనాథ్, దుర్గేష్, కెఎన్ పల్లి సురేష్, జనసేన నాయకులు ఆనంద్ కృష్ణ, మంజునాథ్, షబ్బీర్, రమేష్, తేదేపా క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు లక్ష్మీనరసప , బీమరాజు, మాజీ ఎంపిటిసిలు కిష్టప్ప, భోజరాజు, రాజేంద్ర నజీర్, బసవరాజు, నరసింహస్వామి, బూదిపల్లి జయరామప్ప, తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 19 ఏళ్లుగా 'బోరు'న విలపిస్తున్న రైతు

**- అలుపెరగని పోరాటంతో అలసిపోయానంటున్న బాధితరైతు**

**- పోలీసు, రెవెన్యూ అధికారుల అలసత్వంతో అన్నదాత ఆవేదన**

**యాడికి(తాడిపత్రి), సెప్టెంబరు 24, ప్రభాతవార్త**



బాధితరైతు రామచంద్రుడు

ఒకటి కాదు రెండు కాదు ఏకంగా 19 ఏళ్లుగా తన పొలంలోని బోరుబావిని శుభ్రం చేసుకోవడానికి ఆ అన్నదాత అలుపెరగని పోరాటం చేస్తున్నాడు. 2005 నుంచి మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారుల చుట్టూ తన సమస్యపై తిరిగి తిరిగి విసిగిపోయిన ఆ రైతుకు నేషనల్ లోక్ అదాలత్‌లో ఊరట లభించినా స్థానిక అధికారుల నుంచి ఊరట లభించకపోవడంతో బోరున విలపిస్తున్నాడు. వివరాల్లోకి వెళితే యాడికి మండలం పుప్పాలకు చెందిన చెంచు రామచంద్రుడు సర్వే నంబరు 250–ఎలో తనకున్న 3.50 ఎకరాల్లో తవ్వుకున్న బోరుబావిని శుభ్రం చేసుకోవడానికి ప్రయత్నించగా అతని సమీప పొలంలోని మరో రైతు అభ్యంతరం తెలిపాడు. అప్పటికే ఉన్న బోరుబావిని శుభ్రం చేసుకోవడానికి అనుమతివ్వాలంటూ రెవెన్యూ అధికారుల చుట్టూ తిరిగాడు. ఈ సమస్య రాజకీయ రంగు పులుముకోవడంతో ఇక ఈ బాధిత రైతు న్యాయపోరాటం చేయక తప్పలేదు. 2013 నుంచి 2020 వరకు హైకోర్టు, నేషనల్ లోక్ అదాలత్‌లలో కూడా ఈ సమస్య నలిగి చివరికి రామచంద్రుడికి ఉపశమనం లభించింది. తదుపరి పరిణామాలతో బోరుబావిని శుభ్రం చేసుకోవడానికి, హైకోర్టులో రిట్‌పిటిషన్ ముగించుకోవడానికి ఇరు పార్టీలు అంగీకరించడంతో బోరుబావి శుభ్రతకు మార్గం సుగమమైంది. అయితే లోక్ అదాలత్‌లో సమస్యకు పరిష్కారం లభించినా రెవెన్యూ అధికారుల సమక్షంలోనే బోరుబావిని శుభ్రం చేసుకోవాలని తెలపడంతో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి బాధిత రైతుకు నిరభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. దీంతో తహసీల్దార్ రైతు రామచంద్రుడికి బోరుబావి శుభ్రం చేసుకోవచ్చని ఎండార్స్‌మెంట్ ఇచ్చారు. అయితే బోరు యంత్రాన్ని తీసుకొని బోరువద్దకు వెళ్లిన తర్వాత వ్యతిరేక వర్గం మళ్లీ గొడవకు దిగనుందనే సమాచారంతో పోలీసులు తనను మాత్రమే స్టేషన్‌కు పిలిపించి బోరు యంత్రాన్ని వెనక్కు పంపినట్లు పోలీసులపై బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. లోక్‌అదాలత్ తీర్పుతో తనకు పోలీసుల రక్షణ లభిస్తుందనే ఆశతో ముందడుగు వేసిన బాధిత రైతుకు పోలీసుల చర్య నివ్వెర పరచింది. దీంతో ఇక్కడి పోలీసుల తీరుపై ఆవేదన వ్యక్తం చేస్తూ జిల్లా ఎస్పీకి ఇటీవల ఫిర్యాదు చేశాడు. బాధిత రైతుకు న్యాయం చేయమని ఎస్పీ తాడిపత్రి డీఎస్పీని ఆదేశించారు. డీఎస్పీ ఆ బాధ్యతను యాడికి సీఐకి అప్పగించారు. అయితే ఇక్కడ కూడా అదిగో ఇదిగో అంటూ రక్షణ కల్పించడానికి అలసత్వం ప్రదర్శిస్తూనే ఉండటంతో 19 ఏళ్ల పోరాటనికి ఇంకా తెరపడలేదని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

## పలువురు విఆర్‌ఓలకు స్థాన చలనం

**ఓబుళదేవరచెరువు, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త**

మండలంలో పనిచేస్తున్న గ్రేడ్–1 విఆర్‌ఓలకు జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ స్థాన చలనం, బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అదే విధంగా వేరే మండాలాల్లో పనిచేస్తున్న విఆర్‌ఓలను ఓడిసి మండలానిక బదిలీ చేశారు. డబురువారిపల్లి సచివాలయంలో పనిచేస్తున్న లోకేశ్వరమ్మకు అల్లాపల్లి, కొండకమర్ల–2లో పనిచేస్తున్న వెంకటరమణను తిప్పేపల్లి సచివాలయానికి స్థానచలనం కలిగించారు. అదే విధంగా అమడగూరు మండలం గుండవారిపల్లి, టి కుంట్లపల్లిలో తంగేడుకుంట విఆర్‌ఓ సుధాకర్‌ను కదిరి మండలం పట్నం, వెంకటాపురంలో పనిచేస్తున్న ఆంజనేయులును తనకల్లు మండలం బొంతలపల్లి, కొండకమర్ల–1 గంగాద్రిని తనకల్లు మండలం కొక్కంటికి, సున్నంపల్లిలో పనిచేస్తున్న నరసింహులును అమడగూరు మండలం మహ్మదాబాద్‌కు బదిలీ చేశారు. గోరంట్ల మండలంలో పనిచేస్తున్న బాలక్రిష్ణను వెంటాపురం సచివాలయం, అమడగూరు మండలంలో పనిచేస్తున్న బాలప్పను ఓడిసి–2, తనకల్లు మండలంలో పనిచేస్తున్న దాదాఫీర్‌ను టి కుంట్లపల్లి, నల్లమాడ–1లో పనిచేస్తున్న వాసుదేవరెడ్డిని డబురువారిపల్లి సచివాయలంలో విఆర్‌ఓగా నియమించారు. త్వరలోనే వీరు బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

# పాలల్లో వెన్నశాతం పెరగాలంటే పచ్చగడ్డితోపాటు ఆవులకు ఎండుగడ్డి పెట్టాలి

- మల్బరి షెడ్ల నిర్మాణానికి 10 లక్షలు పెంచడానికి ఎంపి సిల్క్ బోర్డు మెంబర్‌ప్రతిపాదనలు
- ఆవులకు 400 ఇన్సురెన్స్ చెల్లిస్తే ఆవులు మృతి చెందితే 30వేలు




సమావేశంలో మాట్లాడుతున్న జడ్పిటిసి ఉమేష్, సమావేశానికి హాజరైన రైతులు

**అగళి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

పొలం పిలుస్తోంది అనే కార్యక్రమంపై అగళి ఆర్‌బికె కేంద్రంలో రైతులకు అవగాహన సదస్సు జరిగింది. ఈసదస్సుకు ముఖ్యఅతిథిగా జడ్పిటిసి ఉమేష్ హాజరై ప్రసంగించారు. ప్రస్తుతం మల్బరీ షెడ్లకు 6.25లక్షలు, 2.40లక్షలు మాత్రం షెడ్లను మంజూరుచేస్తున్నారని, అది ఉపాధిహామీ పథకం, సెరికల్చర్ శాఖలు ఉమ్మడిగా మంజూరు చేస్తోంది. అదే మల్బరీ షెడ్ల నిర్మాణానికి అంచనా వ్యయం 10లక్షలు పెంచాలని ఎంపిఅబికా లక్ష్మినారాయణ సిల్క్‌బోర్డుమెంబర్ కావున ప్రతిపాదనలు పంపినట్లు మల్బరీ సిల్క్‌బోర్డు విత్తన రాష్ట్ర అవార్డుగ్రహీత చిదానంద తెలిపారు. ప్రతి మంగళవారం బుధవారం వ్యవసాయ శాఖ వెటర్నరీ సెరికల్చర్, హార్టికల్చర్, ఫారెస్ట్ విద్యుత్‌శాఖ వారు ఉమ్మడిగా రైతుల సమస్యల పరిష్కారానికి సమావేశం నిర్వహిస్తుంటారని ఏఓ శేఖర్‌నాయక్ తెలిపారు. ప్రభుత్వం నుంచి అందే సబ్సిడి విత్తనాలు, ఎరువులు, పనిముట్లు, మల్బరీ షెడ్లు లాంటివి తీసుకోవడానికి రైతులకు ఇలాంటి సదస్సులు ఉపయోగపడుతాయని జడ్పిటిసి ఉమేష్ అన్నారు. పురుగు మందులు వాడి పంట సాగు చేయడం మూలంగా ఆహారాన్ని తినే ప్రజలు రోగాలకు గురవుతున్నారని, అందుకే ప్రకృతి వ్యవసాయం వైపు వెళ్లాల్సిన అవసరం ఉందని వెటర్నరీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. మండలంలో మినీ గోకుళం షెడ్ల నిర్మాణానికి 130 అప్లికేషన్లు వచ్చినట్లు తెలిపారు. సిఎంఆర్ రకం, చేపలపొడి, మైజా వంటి ఉమ్మడి పదార్థాలు తయారు చేసిన సిఎంఆర్ రకం దాణా సబ్సిడిపోను క్వింటాలుకు 660 చెల్లిస్తే పశువులకు మేత అవుతుందన్నారు. పశువులు కొనుగోలు చేయడానికి దాదాపు 3 లక్షల వరకు బ్యాంకుల్లో రుణాలు ఇస్తారని, 7 శాతం వడ్డీ రేటుతో ఇస్తారని వీటి దరఖాస్తులు వెటర్నరీ కార్యాలయంలో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం అధికారి లక్ష్మీకాంత్ మాట్లాడుతూ.. ఇనగలూరు తదితర ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్నామని, పేద రైతులకు ఉచితంగా వచ్చిన తార్పలీన్‌ను పంపిణీ చేశారు. సెరికల్చర్ రైతు చిదానందకు జాతీయస్థాయిలో పట్టుగూళ్ల విత్తనాల పెంపకంలో అవార్డు వరించడం, అగళి మండల రైతులకు ఆనందదాయకమన్నారు. మల్బరీ రైతులకు కావాల్సిన ఇన్సెంటివ్ డబ్బులు త్వరలో వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని రైతన్నలు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచు లక్ష్మమ్మ, హనుమంతరాయప్ప, రైతులు రమేష్, జైరామప్ప, హార్టికల్చర్ ఉద్యోగి చంద్ర, సచివాలయ ఉద్యోగులు హాజరయ్యారు.

## మల్బరీ అవార్డు గ్రహీతకు జడ్పిటిసి, రైతులు సన్మానం

**అగళి, సెప్టెంబర్ 23 ప్రభాతవార్త**



సన్మానం చేస్తున్న దృశ్యం

పట్టుపరిశ్రమ ప్లాటినం జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా అగళి మండలానికి చెందిన మల్బరీ రైతు మల్బరీ విత్తనం పెంపకంలో మంచి ప్రతిభ కనబర్చినందుకు పట్టుగూళ్ల ఉత్తమ సీడ్స్ తయారీ దారుడిగా చిదానంద అనే రైతును ఎంపిక చేసి జాతీయ స్థాయి ఉత్తమ మల్బరీ రైతుగా ఎంపిక చేసి సన్మానంతోపాటు అవార్డును, మెమెంటోను బహుకరించారు. మైసూరులో జరిగిన ఈ కార్యక్రమంలో సన్మానం నిర్వహించారు. అందుకు అగళి మండల జడ్పిటిసి సదరు ఉత్తమ రైతు చిదానందకు సన్మానంతోపాటు మెమెంటోను అందజేశారు. మండల రైతులు, ఉద్యోగులు సైతం చిదానందను శాలువాతో సన్మానించి మెమెంటోను బహుకరించారు. మారుమూల మండలంలో ఇలాంటి ఉత్తమ రైతుగా జాతీయ స్థాయిలో ఎంపిక కావడం హర్షదాయకమన్నారు.

## విజయకుమార్‌కు నామినేటెడ్ పదవి ఇవ్వడం ఆనందదాయకం

**బత్తలపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**



బత్తలపల్లి కూడలిలో సంబరాలు జరుపుకుంటున్న తెదెపా నాయకులు

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యదర్శి, మాజీ ఎంఎల్ఏల తనయుడు గోనుగుంట్ల విజయ్‌మార్‌కు నామినేటెడ్ పదవి ఇవ్వడం ఆనందదాయకమని మండల టిడిపి నాయకులు అన్నారు. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా వున్న తెలుగుదేశం ఆశావహులకు నామినేటెడ్ పదవులను ప్రకటించారు. ఆ పదవులలో మండలంలోని మాల్యవంతం గ్రామానికి చెందిన గోనుగుంట్ల విజయ్‌కుమార్‌కు ఏపి రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ అండ్ మౌళిక వసతుల డైరెక్టర్‌గా నియమించినట్లు ప్రకటించారు. ఈ ఎన్నికను పురస్కరించుకుని మండల టిడిపి నాయకులు మండలకేంద్రంలోని నాలుగురోడ్ల కూడలిలో బాణాసంచా కాల్చుతూ దప్పుల మోత మధ్య జై చంద్రబాబు, జై టిడిపి, జై పరిటాల అంటూ నినాదాలు చేసుకుంటూ కలియతిరిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విజయకుమార్‌కు నామినేటెడ్ పదవి రావడం ఆనందదాయకమన్నారు. తండ్రి మాజీ ఎంఎల్ఏ దివంగత అనంతరెడ్డి, తల్లి మాజీ ఎంఎల్ఏ జయమ్మల తనయుడిగా నియోజకవర్గంతో పాటు జిల్లాలోనే సౌమ్యుడిగా, అజాతశత్రువుగా పేరుగాంచిన విజయకుమార్‌కు ముఖ్యమంత్రి ఇచ్చిన పదవికి నూరుశాతం అర్హుడేనన్నారు. ఈ కార్యక్రమంలో నెట్టెం రమణ, బత్తల మనోజ్, సదాశివ, మండల టిడిపి నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విద్యార్థినులు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోండి

-గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త ఎ.మురళీకృష్ణ

-బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

**ఉరవకొండ, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**



గురుకులంలో విద్యార్థుల కోసం వండిన ఆహారాన్ని పరిశీలిస్తున్న డీజీఓ ఎ.మురళీకృష్ణ

సీజినల్ వ్యాధులు పెరిగి విద్యార్థినులు రోగాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గురుకుల పాఠశాలల జిల్లా సమన్వయకర్త ఎ.మురళీకృష్ణ సూచించారు. మంగళవారం ఆయన పట్టణంలోని శివరామిరెడ్డి కాలనీలోగల డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలోని వంటగది, స్టోర్ రూమ్, డైనింగ్ హాల్, డార్మెటరీ తదితరాలను, నీటి సరఫరా వ్యవస్థ, పారిశుద్ధ్య పనులను క్షుణ్ణంగా పరిశీలించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి వైద్యులు నెలకు రెండు రోజులు గురుకులానికి వచ్చి విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారా అని ఆరా తీశారు. విద్యార్థుల కోసం వండిన ఆహార పదార్థాలను విద్యార్థులతో కలిసి తిని నాణ్యతను పరిశీలించారు. గురుకులం ఆవరణాన్ని శుభ్రంగా ఉంచుకోవాలని పారిశుద్ధ్యం మెరుగునకు స్థానిక గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులచే పనులు చేయించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి సమస్యలపై ఆరాతీసి పలు సూచనలు చేశారు. లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అదిరోహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి రమణకుమార్, ఎంఎంసీ ఛైర్మెన్ కూడేరు హరి, వైస్ ఛైర్మెన్ చాబాల చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ జయమ్మ, స్టాఫ్ నర్సు బ్యూలా కుమారి, పంచాయతీ పారిశుద్ధ్య మేస్త్రీలు పాల్గొన్నారు.

## జెడ్పి షాపులను అద్దెకు ఇచ్చేందుకు వేలం

**బత్తలపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

మండలకేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల వదద వున్న జిల్లాపరిషత్ షాపులను అద్దెకు ఇచ్చేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ సాయిమనోహర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరికి ఆనుకుని మూడు వ్యాపారానికి అనువైన గదులు వున్నాయన్నారు వాటిని అద్దెకు ఇచ్చేందుకు ఈ నెల 30వ తేదీ సోమవారం ఉదయం 11గంటలకు ఎంపిడిఓ కార్యాలయంలో వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి గదికి రూ. 7వేలు, రెండు, మూడు గదులకు రూ. 7500లు అద్దెగా నిర్ధారించారన్నారు. ఈ వేలంలో పాల్గొనే వారు రూ. 1000లు ఒక్కో గదికి దరావత్తు కట్టవలసి వుంటుందన్నారు. 01.10.2024 నుండి 30.09.2027వరకు అద్దెకు అగ్రిమెంటు వుంటుందన్నారు. ఆశావహులు ఈ వేలంలో పాల్గొనాలని ఆయన కోరారు.

## గ్రామాల అభివృద్ధి అధికారులకు పట్టదా అన్న శీర్షికకు స్పందించిన అధికారులు

**బ్రహ్మసముద్రం సెప్టెంబర్ 24 ప్రభాతవార్త,**



వర్షపునీరు తొలగించి బ్లీచింగ్ చల్లుతున్న దృశ్యం

వార్త ప్రభావం

మండలంలోని ఎరడికెరలో వర్షపునీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గ్రామాల అభివృద్ధి అధికారులకు పట్టదా అన్న శీర్షిక వార్త కథనంలో రావడంలో అధికారులు స్పందించి ఈఓపిఆర్‌డి అదేశాల మేరకు వర్షపునీటిని తొలగించి అక్కడ బ్లీచింగ్‌పౌడర్‌నుచల్లించిన పంఛాయితీకార్యదర్సి మురళి సచివాలయ సిబ్బంది.

## కసాపురం ఆలయ ఇఒగా కె.వాణి బాధ్యతలు స్వీకరణ

**గుంతకల్లు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**



ఇఒగా బాధ్యతలు స్వీకరిస్తున్న కె.వాణి

పసిద్ధపుణ్యక్షేత్రం కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయ ఇఒగా కె.వాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. చిత్తూరు జిల్లా కాణిపాకం శ్రీవరసిద్ధివినాయక ఆలయ ఇఒగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఇఒ భద్రాద్రి శ్రీకాకుళం జిల్లా అరసవెల్లి సూర్యదేవాలయాలికి బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఇఒ కె.వాణికి సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## రాష్ట్రమార్క్‌ఫెడ్ కార్పోరేషన్ డైరెక్టర్‌గా కెసి హరికుమార్

**గుంతకల్లు. సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**



కెసి హరికుమార్

రాష్ట్ర మార్క్‌ఫెడ్ కార్పోరేషన్ డైరెక్టర్‌గా పట్టణానికి చెందిన కెసి హరికుమార్‌ను ఎంపికచేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. హరికుమార్ తండ్రి స్వర్గీయ కెసి నారాయణ తెలుగుదేశంపార్టీలో క్రియాశీలంగా పనిచేశారు. ఎస్‌జెపి పాఠశాలలో కెసి నారాయణ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ నందమూరి తారకరామారావు పిలువు మేరకు 1989లో పార్టీలో చేరారు. గుత్తి మండలం నుండి 1995లో జెడ్‌పిటిసి మెంబర్‌గా కెసి నారాయణ ఎంపికై నాలుగు ఏళ్లపాటు జెడ్‌పివైస్‌ఛైర్మన్‌గా పనిచేశారు. అప్పటి జెడ్‌పిఛైర్మన్ బికె పార్థసారధి ఎంపిగా ఎన్నిక కావడంతో చివరి 9 నెలలు జెడ్‌పిఛైర్మన్‌గా ఆయన పనిచేశారు. అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో వున్న చొరవతో జిల్లా అభివృద్ధి కోసం పాటుపడి దాదాపు 25 కోట్ల నిధులు మంజూరు చేయించి ప్రజల మన్ననలు పొందారు. ఆయన కుమారుడు కెసి హరికుమార్ పార్టీలో పనిచేస్తూ శ్రీశంకరనాందగిరిస్వామి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్‌గా కొనసాగుతున్నారు. తనను ఎంపిక చేసినందుకు గాను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో పాటు ఎన్‌డిఎ కూటమి పెద్దలకు కెసి హరికుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

## పౌష్టికాహారంపై అవగాహన

**గుంతకల్లు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**



పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండలంలోని ములకలపెంట గ్రామంలో సూపర్‌వైజర్ పుష్పావతి ఆధ్వర్యంలో గర్భవతులు, బాలింతలకు పౌష్టికాహారంపై మంగళవారం అవగాహన కల్పించారు. బిడ్డ పుట్టిన గంటలోపు ముర్రుపాలు పట్టాలని సూపర్‌వైజర్ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇవెక్కడి బదిలీలు బాబోయ్..!

- ఇద్దరేసి చొప్పున వీఆర్‌ఓలకు ఒకే సచివాలయంలో పోస్టింగ్
- గ్రేడ్-వీఆర్‌ఓల బదిలీల్లో కొనసాగిన అధికారుల ఇష్టారాజ్యం

**ఉరవకొండ, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

గ్రేడ్-1 వీఆర్‌ఓల బదిలీల్లో పారదర్శకత లోపించి ఇష్టారాజ్యం కొనసాగినట్లు స్పష్టమౌతోంది. ఇద్దరు వీఆర్‌ఓలు ఒకే సచివాలయంలో పోస్టింగ్ ఇవ్వడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తుండగా సదరు వీఆర్‌ఓలు దిక్కు తోచక తికమక పడుతున్నారు. ఉరవకొండ మండలంలోని చిన్నముష్టూరు గ్రామ సచివాలయ వీఆర్‌ఓ తలారి గోపాల్‌ను విడపనకల్లు మండలం పెద్ద కొట్టాలపల్లి సచివాలయానికి బదిలీ చేయగా అదే స్థానంలో గుత్తి మండలం కరడికికొండ సచివాలయం వీఆర్‌ఓ పి.లావణ్యకు పోస్టింగ్ ఇచ్చారు. పుట్లూరు మండలం అరకటవేముల సచివాలయం వీఆర్‌ఓ ఎస్.రిజ్వానాను తాడిపత్రి మండలం ఎర్రగుంటపల్లి-2 సచివాలయానికి బదిలీ చేసిన అధికారులు అదే సచివాలయానికి యల్లనూరు మండలం పెద్దమల్లేపల్లి సచివాలయంలో పనిచేస్తున్న పి.శంకర్‌ప్రసాద్‌కు పోస్టింగ్ ఇచ్చారు. గుంతకల్లు మండలం హనుమేష్ నగర్ సచివాలయం వీఆర్‌ఓ మీనుగ కీర్తిను అదే మండలంలోని ఎన్.వెంకటాంపల్లికు బదిలీ చేశారు. అయితే ఆమె చాలా కాలం క్రితమే గ్రూప్-4 సెలక్షన్స్‌లో ఎంపికై వజ్రకరూరు మండల తహశీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్/టైపిస్టుగా ఉద్యోగం చేస్తుండటం విశేషం. ఆమె ఇప్పుడు వీఆర్‌ఓ ఉద్యోగం చేయాలా లేక జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం చేయాలో అర్థంకాని పరిస్థితులు నెలకొన్నాయి. కణేకల్లు మండలం హులికేర సచివాలయం వీఆర్‌ఓ టి.ప్రభాకర్‌ను పెద్దవడుగూరు మండలం చిత్రచేడు సచివాలయం వీఆర్‌ఓగా బదిలీ చేసిన అధికారులు అదే మండలంలోని బ్రహ్మసముద్రం సచివాలయ వీఆర్‌ఓ ఎన్.దామోదర్‌నాయుడును కూడా అదే సచివాలయానికే బదిలీ చేశారు. బదిలీల ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం రెండు సార్లు వాయిదా వేసినా సంబంధిత రెవిన్యూ అధికారులు మాత్రం బదిలీల్లో ఇష్టారాజ్యాన్ని కొనసాగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు చేసిన తప్పులను సరిదిద్దుకోవాల్సి ఉంది.

## ఉరవకొండలో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం

- మేజర్ పంచాయతీ ఆవరణంలో కేక్ కటింగ్, ఇంటింటికీ వెళ్లి కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంచుతూ అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**ఉరవకొండ, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

నియోజకవర్గ కేంద్రమైన ఉరవకొండ పట్టణంలో మంగళవారం 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణంలో సమావేశమైన అధికారులు, టీడీపీ నాయకులు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తిఅయిన సందర్భంగా కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కరపత్రాలను పంపిణీ చేస్తూ గోడలకు స్టిక్కర్లను అతికించారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. నిరుద్యోగ యువతకు అండగా మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకు చర్యలు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ మొత్తం 4వేల రూపాయలకు పెంపు, ప్రతినెలా 1వ తేదీనే ప్రభుత్వ ఉద్యోగులందరికీ జీతాలు, ధాన్యం కొనగోలు బకాయిల చెల్లింపు, స్థానిక సంస్థలకు నిధులు, అన్న క్యాంటీన్ల పునః ప్రారంభం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, వరద బాధితులకు సహకారం తదితర అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో మేజర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎ.వి.రమణకుమార్, టీడీపీ పట్టణ అధ్యక్షులు మాదినేని రామాంజినేయులు, మాజీ వైస్ ఎంపీపీ పి.రాజేష్, సీనియర్‌నాయకులు వేల్పులశ్రీనివాసులు, యేళ్ళతిమ్మప్ప, సి.నాగేశ్వరరావు, డి.సాధిక్‌బాషా, యం.రామాంజినేయులు, పి.నిరంజన్‌గౌడ్, వేల్పుల వాసుదేవుడు, కె.ఖలంధర్, రహంతుల్లా, మహబూబ్‌బాషా, పల్లా నరసింహులు, ప్యారం భరత్, నిమ్మల ప్రసాద్, ముద్దలాపురం రాజు, యం.వరప్రసాద్, ఖాదర్‌బాషా, ఈడిగ వేణుగౌడ్, బాబు, యం.పెద్దన్న, గోపాల్, రఘు, ప్రభాకర్, వడ్డే లాలుస్వామి, విశ్వనాథ్, జమీల్, శంకర సుదర్శన్, ప్రతాప్, రమేష్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**గుంతకల్లు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**



కార్యక్రమంలో మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణస్వామి

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ స్వామి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దంచర్ల గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ఇది మంచి ప్రభుత్వం వంద రోజుల్లో అమలు చేసిన హామీలు, చేయబోతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. అంతకుముందు మండల వ్యవసాయాధికారిని స్వాతి మాట్లాడుతూ వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థకశాఖల్లో అందచేసే పథకాల గురించి రైతులకు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ మస్తాన్‌రావు, టిడిపి నాయకులు బండారు ఆనంద్, బిఎస్ కృష్ణారెడ్డి, గ్రామసర్పంచు నారాయణస్వామి, ఎంపిటిసి పరశురాముడు, నాయకులు తలారి మస్తానప్ప, తదితరులు పాల్గొన్నారు.

## రైలు నుండి పడి ప్రయాణికుడు మృతి

**గుత్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**



మృతదేహాన్ని సిఐ పరిశీలిస్తున్న దృశ్యం

పట్టణ శివారులోని తురకపల్లి రైల్వే బ్రిడ్జి సమీపంలో మంగళవారం మల్లికార్జున అనే వ్యక్తి ప్రమాదవశాత్తు రైలు నుండి కిందపడి మృతి చెందాడు. తెలంగాణ రాష్ట్రం యాదాద్రి జిల్లా సైదాపురం గ్రామానికి చెందిన ఇతను వృత్తిరీత్యా బెంగుళూరులో స్థిరపడ్డాడు. గ్రామం నుండి బెంగుళూరుకు వెళుతూ ప్రమాదశాత్తు రైలు నుండి జారిపడి మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు పరిశీలించారు. జిఆర్‌పి ఎస్ఐ నాగప్పకు సమాచారం ఇవ్వడంతో వారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ద్విచక్రవాహనానికి నిప్పు - అగ్నికి ఆహుతి

**గుత్తి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**



వాహనం కాలిపోయిన దృశ్యం

పట్టణంలోని కోట ప్రాంతంలో నివాసం వుండే బేల్దారి శంకర్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్రవాహనం అగ్నికి ఆహుతైంది. సోమవారం రాత్రి ఆయన వాహనాన్ని ఇంటి వద్ద నిలిపివుంచగా అర్ధరాత్రి సమయంలో ఓ దుండగుడు వాహనానికి నిప్పటించగా అగ్నికి ఆహుతైన దృశ్యాలు సిసి కెమెరాలో రికార్డు అయ్యాయి. వ్యక్తిగత కారణాల వల్ల దళితవాడకు చెందిన నరేష్ అనే యువకుడు ఈ దుశ్చర్యకు పాల్పడి వుండవచ్చని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు జాకెట్లు, గ్లౌజులు పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు జాకెట్లు, గ్లౌజులు అందజేస్తున్న దృశ్యం

**ధర్మవరం రూరల్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

ధర్మవరం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు మంత్రి కార్యాలయం ఇన్‌చార్జ్ హరీష్ తాజాగా ప్రత్యేక జాకెట్స్, గ్లౌజులు అందించారు. హరీష్ మాట్లాడుతూ.. కార్మికుల ఆరోగ్యం అనేది ప్రాధాన్యతతో కూడుకున్న విషయం. అందుకు అనుగుణంగా అవసరమైన మౌలిక వసతులను అందించడం మాకు ముఖ్యం. ఈ కార్యక్రమం ద్వారా పారిశుద్ధ్య కార్మికుల పనికి ప్రాధాన్యం ఇవ్వడం, వారి శ్రేయస్సుకు కట్టుబడి ఉండడం మా ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఈ విధమైన కార్యక్రమాలను కొనసాగించడానికి మంత్రి కార్యాలయం కట్టుబడి ఉందని ఆయన వెల్లడించారు. భవిష్యత్తులో కూడా ఈ విధమైన కార్యక్రమాలను కొనసాగించడానికి మంత్రి కార్యాలయం కట్టుబడి ఉందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మంత్రి కార్యదర్శి సోమ రమేస్, కార్యాలయ సిబ్బంది, బిజెపి నాయకులు డోలా రాజారెడ్డి, జింకా చంద్ర, సాకే ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## సమాజం పట్ల బాధ్యత సేవాగుణం అలవర్చుకోవాలి

**ధర్మవరం రూరల్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ప్రశాంతి

చదువు విజ్ఞానంతోపాటు సమాజం పట్ల బాధ్యత సేవా గుణమును అలవర్చుకోవాలని ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో జాతీయ సేవా పథకం దినోత్సవ వేడుకలను అధ్యాపకులు, విద్యార్థుల నడుమ ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రశాంతి మాట్లాడుతూ.. 1969 సెప్టెంబర్ 24న అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి డాక్టర్ వికెఆర్‌వి.రావు జాతిపిత గాంధీజీ శతజయంతిసందర్భంగా 37 విశ్వవిద్యాల యాలలో జాతీ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) కార్యక్రమాన్ని ప్రారంభించారు. చదువుతో విజ్ఞానంతోపాటు సమాజం పట్ల బాధ్యత సేవా గుణం పెంపొందించాలనే లక్ష్యంతో ప్రారంభించిన ఈ జాతీయ సేవా పథకాన్ని ఎన్ఎస్ఎస్ అని పిలుస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సి.కుల్లాయిరెడ్డి, అధ్యాపక, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన ఎస్‌జిఎఫ్‌మండల స్థాయి పోటీలు

-విజేతలకు బహుమతులు అందజేత



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఎంఈఓ-2 శ్రీదేవి హెచ్ఎం అబ్బాస్

**కనగానపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎస్‌జిఎఫ్‌మండలస్థాయి అండర్-14 బాలబాలికలు క్రీడాపోటీలు ఎంఈఓ-2 శ్రీదేవి ప్రధానోపాధ్యాయులు అబ్బాస్‌ఆధ్వర్యంలో ఈకార్యక్రమం నిర్వహించారు. ఈ పోటీలు మండలంలోని వివిధ పాఠశాలల నుంచి సుమారు 300 మంది విద్యార్థిని, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఖోఖోలో అండర్-14 బాలురు, బాలికలు విభాగంలో జడ్పిహెచ్ఎస్ కనగానపల్లి విద్యార్థులు విన్నర్స్‌గాను, మోడల్ స్కూల్ విద్యార్థులు రన్నర్స్‌గాను, ఖోఖో అండర్-17 బాలురు, బాలికలు విభాగంలో జడ్పిహెచ్ఎస్ కనగానపల్లి విద్యార్థులు విన్నర్‌గాను మోడల్ స్కూల్, కేజీబివి విద్యార్థులు రన్నర్స్‌గానూ నిలిచారు. కబడ్డీలో మోడల్ స్కూల్ విద్యార్థులు యోగలో కెజిబివి విద్యార్తినులు వాలీబాల్‌లో జడ్పిహెచ్ఎస్ విద్యార్థులు మద్దుల చెరువు,మ ఆమిళ్లపల్లి, తగరకుంట విద్యార్థులు ప్రతిభను కనబర్చి నియోజకవర్గ స్థాయికి ఎంపిక కావడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిడి రమేష్, వ్యాయామ ఉపాధ్యాయులు శివారెడ్డి, జయసింహ, మాధవరాజు, రమేష్, గురుప్రియ, ఉపాధ్యాయులు గిరక నా గన్న తదితరులు పాల్గొన్నారు.

## చెన్నేకోట, సనప రహదారిలో కల్వర్టును నిర్మించండి

**కనగానపల్లి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**




రోడ్డు మీద హంద్రీనీవా నీళ్లు పారుతున్న దృశ్యం

మండల పరిధిలోని చెన్నేకోట, సనప గ్రామాల మధ్య మట్టి రోడ్డు మీదుగా హంద్రీనీవా నీరు రోడ్డు మీద పారుతుండడంతో అటు వెళ్లే వాహనదారులు వెళ్లాలంటే ప్రమాదాల భారిన పడుతున్నారు. మెండం బాలరాజు, ఆంథోని, రాజప్ప గ్రామస్తులు మాట్లాడుతూ.. అధికారులకు కల్వర్టు నిర్మించాలని ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని వెంటనే కల్వర్టును నిర్మించి వాహన దారులను సమస్యను తీర్చాలని వారు కోరుతున్నారు.

## దేవగానపల్లిలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం

**అమరాపురం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**



కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

మండలంలోని దేవగానపల్లిలో మాజీ ఎంపిపి కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టూడియో హనుమంతు, ప్రసాద్, కనెప్ప, సిద్దేశ్వర, వి.సిద్దేశ్వర, టైలర్ రామాంజి, మాజీ ఎంపిటిసి నింగరాజు, టి.రామప్ప, భరత్‌రాజు, వెటర్నరీ మంజు, సచివాలయం హనుమంతు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం స్టిక్కర్‌ను అందించారు. మాజీ ఎంపిపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వంద రోజుల్లో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.

## ఆంధ్ర ప్రగతితోనే ఆర్థిక ప్రగతి

- రుణ వితరణలో భాగంగా రూ. 8.14 కోట్ల రుణాల పంపిణీ
- రుణగ్రహీతలకు వాహనాల అందజేత



మహిళా సంఘాలకు చెక్కును అందిస్తున్న ఆర్ఎం శ్రీదేవి, మేనేజర్ జయశంకర్



రైతులకు ట్రాక్టర్ తాళాలను అందిస్తున్న బ్యాంకు అధికారులు

**యాడికి(తాడిపత్రి), సెప్టెంబరు 24, ప్రభాతవార్త**

ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు తోడ్పాటుతోనే ఖాతాదారులు, రుణగ్రహీతలకు ఆర్థిక ప్రగతి సాధ్యమని ఏపీజీబీ ఆర్ఎమ్ శ్రీదేవి పేర్కొన్నారు. రుణ వితరణలో భాగంగా రాయలచెరువులోని ప్రాథమిక పాఠశాల ఆవరణంలో మంగళవారం స్థానిక ఏపీజీబీ శాఖ ఏర్పాటు చేసిన రుణ గ్రహీతల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రుణ గ్రహీతలైన ఏడుగురు రైతులకు 7 ట్రాక్టర్లు, ఆటో చోదకునికి ఒక ఆటో, ముగ్గురికి మూడు ద్విచక్రవాహనాలను ఆమె చేతుల మీదుగా అందజేశారు. ఏపీజీబీ ద్వారా రుణాలు పొందిన లబ్ధిదారులు బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకొని ఆర్థిక ప్రగతి సాధించాలనేదే తమ లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. రుణ వితరణలో భాగంగా 11 మంది లబ్ధిదారులకు రూ. 8.14 కోట్ల రుణాలు అందిస్తున్నామని ఆమె తెలిపారు. ఏపీజీబీ ద్వారా పొందిన రుణాలను సకాలంలో చెల్లించి బ్యాంకు ద్వారా మరింత మంది ఖాతాదారులకు రుణాలు అందించేలా రుణ గ్రహీతలు సహకరించాలని రాయలచెరువు శాఖ సీనియర్ మేనేజర్ జయశంకర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ శ్రీధర్, బ్యాంకు అధికారులు వెంకటేశ్వరి, స్వాతి, గుప్తేష్, వినోద్‌కుమార్, ఏపీఎమ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పంటలపై అవగాహన కలిగించేందుకే పొలం పిలుస్తోంది కార్యక్రమం

- ఏఓ ఇలియాజ్ అహ్మద్



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న ఏఓ

**ఓబుళదేవరచెరువు, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త**

రైతులు సాగుచేసిన పంటలకు సంబంధించి సస్యరక్షణ, అధిక దిగుబడులు, రసాయన ఎరువుల వినియోగం తదితర అంశాలపై మరింత అవగాహన కలిగించేందుకే ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తోందని మండల వ్యవసాయ అధికారి ఇలియాజ్ అహ్మద్ అన్నారు. మండలంలోని బాబాసాహెబ్‌పల్లి, మామిళ్లకుంట్లపల్లి గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో రైతులు సాగుచేసిన వేరుశనగ పంటను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం పంటల్లో అధిక దిగుబడులు సాధించేందుకు చేపట్టాల్సిన సాగు పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ వెంకటేష్, పట్టుపరిశ్రమశాఖ టెక్నికల్ అసిస్టెంట్ నాగేశ్వరయ్య, వీఏఏ శ్రావణి, లలితాబాయి, అంజినాయక్,ఎంపీఈఓ సరస్వతి, టిడిపి నాయకులు నిజాం, పొగాకు షబ్బీర్, సాదీ నాగరాజు, రాష్ట్ర బీసీ సెల్ నాయకులు అంజినప్ప, పీట్ల సుధాకర్, చికెన్ షాను తదితరులు పాల్గొన్నారు.

## 85 నిట్టూరులో పొలం పిలుస్తోంది



కార్యక్రమంలో పాల్గొన్న ఎఓ, రైతులు

**యల్లనూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

మండలంలోని 85 నిట్టూరు గ్రామంలో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మండల వ్యవసాయాధికారి రామకృష్ణుడు తెలిపారు. ఇందులో భాగంగా వ్యవసాయంలో మందులు లేకుండా పంటలు ఎలా పండించాలి అనే పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు. డ్రిప్పులు, స్ప్రింకర్ల పరికరాల గురించి అవగాహన కల్పించారు. అనంతరం అంజన్‌కుమార్‌రెడ్డి అనే రైతు చీనీ తోటను పరిశీలించారు. తామర పురుగు బెడదను గమనించి దాని నివారణకు వేపనూనె 2 ఎంఎల్ ఒక లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. లేదా అక్టారా ఒక గ్రాము లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. అదేవిధంగా పెగాసస్ 0.5 గ్రాములను లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని ఎఓ తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రఘు, అంజన్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న బిజెపి నాయకులు

**పుట్లూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

మండలంలోని రోడ్డు పక్కన వున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు కంచె ఏర్పాటు చేయాలని బిజెపి శింగనమల నియోజకవర్గం కో కన్వీనర్ కుందు శ్రీనివాసుల రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సోమవారం విద్యుత్‌షాక్‌తో రైతు కేశవరెడ్డికి చెందిన గేదె మృతి చెందిందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయకపోవడం గడ్డి మేయడానికి వెళ్లిన గేదెలు, గొర్రెలు, పశువులు విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందుతున్నాయన్నారు. కావునా విద్యుత్‌శాఖ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటు చేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్, రామకృష్ణ, హరినాథ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బాబు వందరోజుల పాలన పట్ల ప్రజల సంతృప్తి



ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమంలో టిడిపి నాయకులు

**ఓబుళదేవరచెరువు, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం వందరోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా టిడిపి నాయకులు గ్రామాల్లో పర్యటిస్తూ ప్రభుత్వ పనితీరుపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మండల కేంద్రంలో జడ్పీటిసి మాజీ సభ్యుడు పిట్టా ఓబుళరెడ్డి, కన్వీనర్ జయచంద్ర, మాజీ సింగిల్ విండో డైరక్టర్ అరీఫ్‌ఖాన్, డీలర్ సాదీ నాగరాజు, మస్తానమ్మ, బూత్ కన్వీనర్ తోఫిక్, షాను, వైష్ణవి, చాంద్‌బాష, అంజిన్‌రెడ్డి, రంగారెడ్డి కొండకమర్ల బూత్ నెం 173లో పార్లమెంట్ రైతు మీడియా కోఆర్డినేటర్ డాక్టర్ జాకీర్ అహ్మద్, బూత్ కన్వీనర్ ఇర్షాద్, తెలుగు యువత గండికోట భాస్కర్, సాదిక్‌వలి, డీలర్ శమూన్, గాజుకుంటపల్లిలో రైతు సంఘం నాయకుడు అంజన్‌రెడ్డి, మనోహర్, రమణప్ప, వెంకటాపురంలో నాయకులు నారపరెడ్డి, రఘునాథరెడ్డి, చిరంజీవి, ఎఫ్ఏ నరేష్, ఇనగళూరులో మాజీ కన్వీనర్ రామానాయుడు, ఏపియం రమణప్ప, ఎఫ్ఏ శబరీష్‌నాయుడు, గొల్లపల్లిలో లక్ష్మీనారాయణరెడ్డి, ఎఫ్ఏ రవిచంద్రనాయక్, బూత్ కన్వీనర్ ఆంజనేయులునాయక్, గంగులప్ప, ఎం సత్యనారాయణ, శ్రీనివాసులు, రామక్రిష్ణ, వెంకటష్‌లు మంగళవారం ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఇంటింటికి తిరిగి ప్రజలతో మమేకమై ప్రభుత్వ పనితీరుపై విశ్లేషించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాలన పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే పాలనలో ఎన్నో మార్పులు తీసుకువచ్చారని ఆయన పాలన పట్ల తమకు అపార విశ్వాసం ఉందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నట్లు నాయకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌పై అవగాహన

**పుట్లూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మండలంలోని మోడల్ స్కూల్‌లోని విద్యార్థులకు మంగళవారం స్వర్ణాంధ్ర 2047 విజన్ డాక్యుమెంట్‌పై ఉపాధ్యాయులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపి డిఓ యోగానందరెడ్డి, తహశీల్దార్, సహాయ గణాంక అధికారి, డిఆర్‌డిఎ-ఏపిఎం, ఉపాధి హామీ పథకం ఏపిఓ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన వంద సంవత్సరాలకు అంటే 2047 సంవత్సరం నాటికి మన ఆంధ్రప్రదేశ్ ఎలా వుండాలి, అనే అంశానికి సంబంధించి ఒక విజన్ ప్రణాళిక కోసం అందరి అభిప్రాయాలను రాష్ట్ర ప్రభుత్వం కోరుతోందన్నారు. ఇంటంటికి సచివాలయం ఉద్యోగుల ద్వారా ఒక కరపత్రం పంపిణీ చేయడం జరుగుతుందని ఆ కరపత్రంలో ఒక క్యూఆర్ కోడ్ వుంటుందని దానిని స్కాన్ చేసి అభిప్రాయాలను, సూచనలు, సలహాలు తెలియచేయాలన్నారు. నవంబర్1 నాటిని తయారు చేసి ప్రకటించడం జరుగుతుందన్నారు. ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు తమ సలహాలు, సూచనలు ఇవ్వాలని వారు కోరారు.

## సోలార్ సేవలు వినియోగించుకోండి



నూతన సోలార్ పలకలను ఏర్పాటు చేసిన దృశ్యం

**యాడికి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

మండలంలోని రాయలచెరువు గ్రామంలో ఓ నూతన భవనంపై మంగళవారం రాజా ఎంటర్‌ప్రైజెస్ గూటిపల్లి రమేష్, సబ్ ఇంజనీర్ శ్రీనివాస్‌రెడ్డిల పర్యవేక్షణలో సోలార్ పలకలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి, వినియోగదారుడు మనో మాట్లాడుతూ భవిష్యత్తులో సోలార్ వినియోగదారులే ఎక్కువ అవుతారన్నారు. దీని వల్ల కలిగే లాభాల గురించి వివరించారు. 5కెవి, 10కెవి ఇలా వివిధ దశల్లో సోలార్ ఏర్పాటు చేసుకోవచ్చున్నారు. సోలార్ ఏ విధంగా వినియోగించుకోవాలన్న దానిపై పలు సూచనలు, సలహాలు అందించారు. అనంతరం నూతన సోలార్ ప్యాడ్‌లను ఏర్పాటు చేశారు. స్థానిక విద్యుత్ లైన్‌మెన్ వెంకటనారాయణ వీరికి సహకరించినట్లు వారు తెలిపారు.

## వికసిత్ భారత్‌యే ప్రధాన లక్ష్యం

**యాడికి, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**



కరపత్రం అందచేస్తున్న దృశ్యం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వికసిత్ భారత్ 2047, తగు ప్రణాళికలు ఏర్పాటు చేసుకుని ఆ లక్ష్యాలను చేరుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని కోనఉప్పలపాడు సర్పంచు మార్క్ రామలక్ష్మమ్మ తెలిపారు. మంగళవారం గ్రామ సచివాలయం సమీపంలో సర్పంచు ఆధ్వర్యంలో ఎంపిడిఓ లక్ష్మీనారాయణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం, రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక-2047, ప్రపంచ దేశాల్లో తొలి మూడు అభివృద్ధి చెందిన దేశాల్లో భారతదేశం వుండాలనదే తమ అభిమతమన్నారు. అనంతరం లక్ష్యాల సాధనకు ప్రతిజ్ఞ చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు సంబంధించి గోడపత్రికలు, కరపత్రాలను విడుదల చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు రామాంజినేయులు, రామకృష్ణ, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమం



పొలంబడి కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ భారతి...

**నల్లచెరువు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:**

నల్లచెరువు మండల పరిధిలోని పి.కొత్తపల్లి పంచాయితీలో పోలేవాండ్లపల్లి, బాలేపల్లి తాండా పంచాయితీలో ఏఓ భారతి ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కొన్ని రకాల పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు, సహాలు అందించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడి మార్గాలు, రాష్ట్ర ప్రభుత్వం సబ్సీడితో అందిస్తున్న వాటి వివరాలు, పంట నమోదుతో పథకాలు అమలు తీరు, రైతులకు అందుబాటులో ఉన్న ఎరువులు, సబ్సీడితో అందుబాటులో ఉన్న ప్రత్నమాయ విత్తనాలు, భూమి సారవంతం అయ్యే పద్దతులు, వాటిని అనుసరించే విధానాలు, సేంద్రియ వ్యవసాయం ద్వారా కలిగే లాభాలు పట్ల రైతులకి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఎంపిటిసి మాదవీలత ఉద్యాన శాఖాధికారి లావణ్య, వెటర్నరీ వైద్యులు మల్లికార్జున, వ్యవసాయ సిబ్బంది అనుసూయ, వెటర్నరీ సిబ్బంది సరోజ, వాసన్ సిబ్బంది, రైతున్నలు, గ్రామస్థులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజనం అంతం మాత్రం....

తాగునీరు లేక విద్యార్థులకు అగచాట్లు...



వ్యవసాయం పొలంలో ఉన్న బోర్లల్లో నీరు తాగుతున్న విద్యార్థులు...

**నల్లచెరువు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:**

మండల పరిధిలోని దేవిరెడ్డిపల్లి సమీపంలో గల ఏపిమోడల్‌స్కూల్ యందు మధ్యాహ్న భోజనం సమయంలో విద్యార్థులు త్రాగునీరు లేక ఇబ్బందులు పడ్డారు. తమ దాప్పిని తీర్చుకోవడానికి పొలం వైపు పలురుగులు లెత్తుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మార్పులు చేర్పులు చేపడుతున్నారు. అయితే కొద్ది మంది విద్యార్థులు ఇంటి నుంచి క్యారీలు తీసుకువస్తున్నారు. మధ్యాహ్న భోజన పర్యవేణ తీరు సక్రమంగా అమలు జరిగితే ఇంటి భోజనం ఎందుకు తీసుకువస్తారు అని పలువురు చర్చించుకుంటున్నారు. మధ్యాహ్న భోజనం సమయంలో త్రాగునీరు అందుబాటులోకి తేవాల్సిన బాధ్యత పర్యవేక్షణధికారిపై కలదు. ఎటువంటి చలనం లేకుండా కనీస ప్రత్నమాయ ఏర్పాటు కూడా చేయ్యకుండా నిమ్మకు నీరెత్తినట్లు అధికార్లు వ్యవహరించిన తీరుపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. త్రాగునీరు లేక చెట్లు పొదలు వైపు విద్యార్థులు పరుగులు తీస్తుంటే విష పురుగులతో ఏమి అయినా ప్రమాదం వాటిల్లితే ఎవరు బాధ్యత అని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తున్న మధ్యాహ్న భోజనం పై అందరికి అవగాహన కల్పించి సమ న్యాయంగా చూడాలని సమస్యలు వాటిల్లకుండా పర్యవేక్షణ చెయ్యాలని పలువురు కోరుతున్నారు.

## భగత్‌సింగ్‌నగర్‌లో వీధిలైట్ల ఏర్పాటు




**తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

పట్టణంలోని 30వవార్డు భగత్‌సింగ్‌నగర్‌లో మంగళవారం వార్డు కౌన్సిలర్ మల్లికార్జున వీధిలైట్లను ఏర్పాటు చేయించారు. అదేవిధంగా డ్రైనేజి బ్లాక్ కావడంతో డ్రైనేజి కార్మికులను పిలిపించి డ్రైనేజి సమస్యను పరిష్కరించారు. వార్డులో నీటి సమస్యలు వుండడంతో అధికారులకు తెలియచేసి సమస్యను పరిష్కరించారు. దీంతో వార్డులోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీధిలైట్లను ఏర్పాటు చేస్తున్న దృశ్యం

## మధ్యాహ్న భోజనం పథకాన్ని తనిఖీ చేసిన కౌన్సిలర్



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

**తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

పట్టణంలోని 29వవార్డు సంజీవనగర్‌లోని ప్రాథమిక పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని మంగళవారం వార్డు కౌన్సిలర్ కోట సుశీలమ్మ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ విద్యార్థులతో మాట్లాడుతూ మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆమె అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ ఇన్‌చార్జ్ కోటా లక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మన ఇళ్లు మన గౌరవంపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ రఘునాథ్

**యల్లనూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని ఎంపిడిఓ కార్యాలయంలో మంగళవారం మండల స్పెషల్ ఆఫీసర్ రఘునాథ్ ఆధ్వర్యంలో మండ స్థాయి అధికారులకు మన ఇళ్లు మన గౌరవంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఆఫీసర్ మాట్లాడుతూ ఈ నెల 28న గృహ నిర్మాణ కార్యక్రమం విజయవంతం చేయాలని తెలిపారు. మార్చి నాటికల్లా ఇళ్లు పూర్తి చేయాలన్నారు. అలాగే మన ఇళ్లు మన గౌరవం కార్యక్రమం గోడపత్రికలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఎంపిడిఓ వీర్రాజు, ఇఓఆర్‌డి విజయశేఖర్‌నాయుడు, మండల జెఇ నరేంద్ర, హౌసింగ్ ఎఇ సుప్రజ, పంచాయతీ కార్యదర్శులు గీత, ఉమాదేవి, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



కరపత్రాలను అందచేస్తున్న కౌన్సిలర్ విజయకుమార్

**తాడిపత్రిటౌన్, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని నందలపాడు కౌన్సిలర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం వార్డులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లోనే కూటమి ప్రభుత్వం అనేక అభివృద్ధి కార్యక్రమాలైన 3 వేల ఫించన్‌ను 4 వేలకు పెంచడం, ప్రతి నెలా 1వతేదీనే ఇంటి వద్దకు వచ్చి ఫించన్ అందజేత పేదల ఆకలి తీర్చేందుకు అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించిన ఘనత ఈ ప్రభుత్వానిదేనన్నారు. వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన మంచి కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియచేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పుల్లయ్య, భాను, పవన్, హనోక్, జయ, సచివాలయం అడ్మిన్ నారాయణస్వామి, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపియుఎఫ్‌ఐడిసి సభ్యునిగా భూక్యా కాలేనాయక్

**అమడగూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**

ఏపియుఎఫ్‌ఐడిసి సభ్యునిగా మండలంలోని మలకవారిపల్లితాండాకు చెందిన భూక్యా కాలేనాయక్‌ను ఎంపిక చేశారు. ఐదు సంవత్సరాలుగా పార్టీ కోసం ఆయన చేస్తున్న కృషిని గుర్తించిన అధిష్టానం ఆయనకు ఈ పదవి కట్టబెట్టింది. తనను ఎంపిక చేయడం పట్ల ఆయన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డిలకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. ఈ సందర్భంగా ఆయనకు మండల తేదేపా నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

## పొలం పిలుస్తోంది కార్యక్రమాలు

ఏఓ శ్రీహరినాయక్



పొలం పిలుస్తుంది కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఓ శ్రీహరినాయక్

**తనకల్లు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త:**

తనకల్లు మండలంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మల్రెడ్డి పంచాయితీలోని పెద్దపల్లి మరియు నకరాల తాండాలో వ్యవసాయ అధికారులు మరియు అనుబంధ శాఖ వాళ్ళు పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా రైతులకు వేరుశెనగ పంటలలో రైతులకు అధిక దిగుబడి ఏ విధంగా సాధించాలో వివరించడం జరిగింది. వేరుశెనగ పంటలో దిగుబడులను సాధించవచ్చని వ్యవసాయ అధికారులు శ్రీహరినాయక్ తెలియజేశారు. అదేవిధంగా వేసవిలో వేసవి దిక్కులు దున్నుకుంటే చీడపీడను నివారించవచ్చు అని తెలియజేయడం జరిగింది. విత్తేటప్పుడు విత్తనాలకు విత్తన శుద్ధి చేసుకుంటే తర్వాత వచ్చే తెగుళ్లు గాని పురుగులను నివారించవచ్చని తెలియజేయడం జరిగింది. ఒక కిలో వేరుశెనగ విత్తనానికి ఒక గ్రామ్ టిబు కొనజోల్ గాని, మూడు గ్రాముల మ్యాంగోజం మందును గాని, విత్తనానికి పట్టించి విత్తన శుద్ధి చేస్తే తరువాత వచ్చే తెగుళ్లను నివారించవచ్చని రైతులకు తెలియజేయడం జరిగింది. అదే విధంగా ఒక కిలో వేరుశెనగ విత్తనానికి రెండు ఎంఎల్ ఇమిడా క్రోప్రింట్ 17.8ఎస్ఎల్ కిలిపి విత్తన శుద్ధి చేసుకుంటే తర్వాత వచ్చే వేరుశెనగ పంటలో నీ ముక్కుల్లు తెగులను నివారించవచ్చుఅని రైతులకు తెలియజేయడం జరిగింది. మేర సార్లు జొన్న లేదా మొక్కజొన్న కానీ వేసుకుంటే తర్వాత వచ్చు పురుగులుగాని తెగులు నుంచి గాని వేరుశెనగ పంటను కాపాడుకోవచ్చని తెలియజేయడం జరిగింది. పక్షిస్తావరాలు ఏర్పాటు చేసుకుంటే ఒక ఎకరాకి 6 నుంచి 8వరకు ఏర్పాటు చేసుకుంటే పురుగుముందుల పెట్టుబడిని రైతులు తగ్గించుకోవచ్చని తెలియజేశారు. అదే విధంగా పూత టైంలో జిప్సం ఒక ఎకరాకి 200కేజీలు వేసుకుంటే అధిక దిగుబడులు పొందవచ్చని తెలిపారు. పంట మార్పిడి చేసుకుంటే నేల ఆరోగ్యం మరియు పైరు ఆరోగ్యం కూడా కాపాడుకోవచ్చని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.శ్రీహరినాయక్, జనజాగృతి సంస్థ ప్రతినిధులు పశుసంవర్ధకశాఖ అధికారులు మరియు మెహతాజ్ ఎంపి ఈఓ మరియు రైతులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన



ఉలవలను పంపిణీ చేస్తున్న దృశ్యం

**నల్లమాడ సెప్టెంబర్ 23 ప్రభాతవార్త**

అలసంద, ఉలవ, పెసర లాంటి పంటలను సాగు చేస్తే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చునని వ్యవసాయశాఖ అధికారిని సుమతి తెలిపారు. మంగళవారం దొన్నికోట రైతు సేవా కేంద్రంలో ఉలవలను పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారిని సుమతి, తెలుగుదేశం పార్టీ నాయకులు దొన్నికోట కేశవరెడ్డిలు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఉలవల్లో మంచి పోషక విలువలు ఉంటాయని, మానవుని శరీరంలో కొవ్వును నియంత్రించి ఆరోగ్యాన్ని పదిలంగా ఉండేలా చేస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దప్పయ్యనాయుడు, జయచంద్ర, అంజి,రామప్ప తదితరులు పాల్గొన్నారు.

## వర్షం కోసం గాడిదలకు పెళ్ళి,ఊరేగింపు



గుడి ఎదురుగా గాడిదలకు పెళ్ళి చేస్తున్న దృశ్యం

**తలుపుల,సెప్టెంబర్24,ప్రభాతవార్త**

మండలకే ంద్రలోని రాములవారి గుడి ఎదురుగా వర్షం కోసం గాడిదలకు శాస్త్రోపేతంగా పెళ్ళి చేసి ఊరంతా ఊరేగించారు.జూన్ మాసం నుంచి వర్షాలు మొదలైనా ఇంతవరకు మండలంలో సరైన పదును కూడా కాకపోడంతో పూర్వం పెద్దలు ఈ విదంగా చేస్తే వర్షాలు పడతాయని చేసేవారని,దానిని ఇప్పుడు ఆచరించాల్సిన సమయం వచ్చిందని పెద్దలు తెలిపారు.మండల వ్యాప్తంగా ప్రతి రోజు పల్లెల్లో ఏదో ఒక పల్లె వర్షం కోసం బోనాలు,పూజలు చేస్తూనే ఉన్నారు.రైతులు ఆకాశం వైపు ఎదురు చూడటం తప్ప వర్షం జాడ కనిపించలేదు.మంగళవారం రోజు మండలపరిదిలోని వేపమానిపేట, చదలవాండ్లపల్లి గ్రామాల్లో వర్షం కోసం అమ్మవారికి బోనాలు సమర్పించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎద్దులరాముడు ఈశ్వరయ్య, నారాయణ.రజక సంఘం నాయకులు రమణ,రవి,హరి తదితరలు పాల్గొన్నారు.

## గ్రామాలలో పొలం పిలుస్తోంది



రైతులకు సలహాలు,సూచనలు తెలుపుతున్న ఎ,ఓ షాదాబ్

**తలుపుల,సెప్టెంబర్24,ప్రభాతవార్త:**

మండలపరిదిలోని ఓబుళరెడ్డిపల్లి,లక్కసముద్రం గ్రామాలలో మండల వ్యవసాయశాఖాదికారి షాదాబ్ ఆద్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిచడం జరిగింది.ఈ కార్యక్రమంలో బాగంగా వ్యవసాయశాఖ, ఉద్యావన శాఖ, డ్రిప్,సిరికల్చర్ శాఖలలో అనుసరించవలసిన మెలుకవలు, ప్రభుత్వం అందించే పథకాల గురించి వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పశు వైద్యాధికారి నారాయణస్వామి,మాజీ సర్పంచ్ జయరామ్,దివాన్‌వలి, బార్గవ, చంద్రశేఖర,వి,హెచ్,ఎ చందన రైతులు పాల్గొన్నారు.

## హౌసింగ్ ఏఇగా బాధ్యతలు చేపట్టిన సంధ్య

**పుట్లూరు, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త**



హౌసింగ్ ఎఇ సంధ్య

పుట్లూరు మండల హౌసింగ్ ఏఇగా సంధ్య బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న లోకేష్ యాడికి మండలానికి బదిలీ కావడంతో ఆయన స్థానంలో తాడిపత్రి అర్బన్‌లో విధులు నిర్వహిస్తున్న సంధ్య బదిలీపై పుట్లూరు మండలానికి రావడం జరిగింది. ఈ సందర్భంగా మండలంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన ఇళ్ల వివరాలు పరిశీలించారు. మండల ప్రజలకు అందుబాటులో వుంటూ సమస్యలు పరిష్కరిస్తామని ఆమె తెలిపారు.

